# జగదీశశాస్త్రి స్వప్నము

## ౧

౧౮౯౦ లో జగదీశశాస్త్రి వంటవాడుగ బారిష్టరు పరమశివశర్మతో రంగూనునకేగెను. ౫ వత్సరములలోనే శర్మ అచట మంచిపేరును, ధనమును సంపాదింపగలిగెను. ధనవంతుడగుటతోడనే అతడు భోజనాదివిషయములందాంగ్లేయపద్ధతుల నలవఱచికొని ౧౯౦౦ సంవత్సరమున ఒకచండాలుని వంటకు కుదిర్చికొని జగదీశశాస్త్రికి స్వస్తిచెప్పెను. పరమశివశర్మ సహృదయుడగుటచే పనినుండితొలగించినను జగదీశశాస్త్రికి జీతమిచ్చుచునేయుండెను. అతనిస్వగ్రామమున ఇప్పటికిని "శర్మగారివంటవాడు" అనియే అతనికిప్రతీతి. జగదీశశాస్త్రి పురోహితకుటుంబమున పుట్టినవాడగుట మంత్రములయందించుకజ్ఞానము కలిగియుండెను. ఒక అచ్చుపుస్తకము సహాయముగా ఇతడు రంగూనులో పురోహితవృత్తిమొదలిడెను. ఈవృత్తి ధనార్జనమున కనువగువృత్తి. ఎట్టులో ఇతరులకుతాను వడ్డీలకిచ్చునంతటిధనము నీతడు కూడబెట్టెను. శర్మగారితోనుండునపుడే యీతడు ధనమును కూడబెట్టెననికొందఱనిరి ఎట్లైననేమి, ౧౯౦౯ ప్రాంతముల కీతడొకధనవంతుడాయెను. కొందఱితడు లక్షాధికారి యనిరి మరికొందఱది అతిశయోక్తి యనిరి.

జగదీశశాస్త్రి బ్రహ్మచారి శర్మగారి పనినుండి తొలగి పురోహితకృత్యమున నున్నపుడతనివయస్సు ౪౩. అపుడు వివాహముచేసికో బుద్ధిపుట్టినది. కాని యేకారణముననోగాని యెంతకును సఫలము కాలేదు ౧౯౦౯ లో ఇతడు తంజావూరుప్రాంతములకు భూములు కొనుటకు వచ్చెను. అప్పటికి ౫౨ వత్సరముల వయసీతనికి ఇక వివాహముచేసికొనవలయుననుతలంపువిడిచి తన ఆస్తి కధికారము నిచ్చుట కొకపిల్లవానిని పెంచుకొనుఊహలో నుండెను. దాన పున్నామనరకము నుండి ఉద్ధరణము ఉండునని అతనిఊహ.

కుంభకోణమున మహామాఘోత్సవము సమీపించుచుండెను ఉత్సవదర్శనమున జగదీశశాస్త్రి ఒకవారముదినములు కుంభకోణమున గడపెను. ఆ కోట్లకొలది జనసమూహమున ఒకకుటుంబము అతనికి పరిచయమాయెను ఇదియే అతనిజీవితమున ఒక వింత పరిణామమును గలుగచేసినది

నాగేశ్వర అయ్యరు తన ముగ్గురుకూతులతోడను ఆ యుత్సవమునకు వచ్చెను అబాలికలు రూపవతులు. వారిరూపములు శాస్త్రి నాకర్షించినవి నాగేశ్వర అయ్యరొకనగల వర్తకుడనియు, ఇన్సూర్యెన్సు కంపెనీ ఏజంటనియును తెలియచేసెను. నార్తుఆర్కాటు అతనినివాసము. కలకత్తాప్రాంతములయందెక్కువ కాలముగడపెను అతని కూతులు ఇద్దఱు వివాహితలు. మూడవయామె యింకను వివాహమునకు వేచియున్నది. ౫౨ వర్షప్రాయుడైనను శాస్త్రి మిగుల నారోగ్యవంతుడుగ నుండెను ౩౮ లేక ౪౦ వత్సరములకు మించియుండనట్లుగ అయ్యరు చెప్పెను. బాలికకు ౧౪ వత్సరములు దర్శనీయ. ఫిడేలు బాగుగ వాయింపగలదు. అంతయు నిశ్చితమైనది. అయ్యరు సత్వరముగ ఇన్సూర్యెన్సుకంపెనీకి చెల్లింపవలసియున్న ౨౦౦౦ రూప్యములను శాస్త్రి యిచ్చునట్లును వివాహము తిరుపతికొండపై ఎట్టియాడంబరములులేక జరుపుటకును ఒడంబడిక జరిగినది అనుకొన్నవిధమున ధనము చెల్లింపబడినది. వివాహము ముగిసినది. శాస్త్రి తనభార్యతో రంగూనకేగెను తరువాత తనమామగారి విషయమావంతయు వినవచ్చినదిగాదాతనికి.

## ౨

రెండువత్సరములకు శాస్త్రి కొకకుమారుడు కలిగెను. రామచంద్రుడని పేరుపెట్టికొనిరి. తండ్రికి వేయికన్నులు పిల్లవాడే సుమారు రెండువత్సరము లాతని భార్య విశ్వాసవతియు, గుణవతియుగ నుండినది. కాని

యీవల అనరాని, వినరాని విషయము లాతనికి వినిపించినవి. ౧౯౧౭ లో శాస్త్రిభార్య ఆమె ఫిడేలుతోడను, నగలతోడను, కొంతధనముతోడను అదృశ్యయైనది పాపము శాస్త్రి దుఃఖమునకు మేరలేక పోయినది.

బాలున కిప్పుడు ఏడేండ్లు చదువుకొనుచుండెను పిల్లవానియభివృద్ధి విషయికమగు చింత యాతని మనమును కలవరపఱచు చుండెను. భార్యావిషయమును మఱచిపోయెను ఇంకను పురోహితకార్యమును చేయుచునే యుండెను. ఇదియంతయు భార్యావిషయవిస్మృతికి తోడుపడినది. పిల్లవాడు బాగుగ చదివి పరీక్షలలో కృతార్థుడగుచుండెను ౧౯౩౦ లో తిరిగి జగదీశశాస్త్రి హిందూదేశమునకు వచ్చినపుడు బాలునకు ౧౯ వత్సరములు. కలకత్తా విశ్వవిద్యాలయమున బి. ఎ పరీక్షలో విజయమందెను.

౭౪ వత్సరముల వయసువాడైనను శాస్త్రి' కుత్సాహము తగ్గలేదు ౧౦ మైళ్లు ఒక్కసారిగ నడువగలడు. అతని పనులన్నియు నతడే చేసికొనగలడు. ఒక్కమారేనియు జబ్బుపడలేదు. ఇదియంతయు ఆతని దీర్ఘకాల బ్రహ్మచర్యఫలమని యాతనివిశ్వాసము.

శాస్త్రికి తల్లివైపు బావమఱది యొకడు మద్రాసులో ప్రసిద్ధన్యాయవాది. అడ్వొకేటుజనరలుపదవి ఈసారాతనికి వచ్చునని అందఱు తలచుచుండిరి అతనిపేరు సీతారామఅయ్యరు. శాస్త్రికుమారుని సీత రామయ్యరుభార్య చూచినది. తనకుమార్తె పార్వతి కాతడు భర్త కానగునని నిశ్చయించుకొన్నది. అందమైనవాడు. పట్టపరీక్షనిచ్చినవాడు కూతు నిచ్చుచో ఇంగ్లండునకు ఐ. సి యస్ పరీక్ష కంపనగునని యామెతలచెను.

అంతయు కుదిరినది కాని నీచమగుశారదాబిల్లుఅడ్డుపడుచున్నది. ౧౧ వత్సరములు బాలికకు. అడ్వకేటు జనరలు కాబోవు సీతారామఅయ్యరు చట్టమునుల్లంఘించి అపదూరు పాలుకానగునా ? అగుగాక అతని భార్య జంకలేదు ఏస్వదేశసంస్థానమునసేని పెండ్లి చేయ వచ్చునని యామెభర్తకు సలహానిచ్చినది. మొదట అంగీకరించినాడు. ఎట్లో ఆసాయింత్రమే క్లబ్బుకీవార్త ప్రాకినది.

“ నీవు నీబాలికకు వివాహముచేయుటకు పుదుక్కోట కేగుచుంటివి వటగదా?” అని యొకడు.

“ అట్లెన్నటికి జరుగదు. నీవు విన్నది అసత్యము ” అని సీతారామయ్యరుప్రత్యుత్తరించెను. తీవ్రముగ అసత్యమని వాదించిన పిదప వివాహముచేయుటకు తన హృదయము సమ్మతింపనందున తననిశ్చయమును భార్యకు తెలిపెను.

“ ఇట్టినిరుపయోగములైన మిక్రొత్తచట్టములనల్ల చక్కనిఅల్లునిబోగొట్టుకొనగల బుద్ధిహీనులమగుటయా, మనము ?” అని యాతనిభార్య పలికినది

“ప్రమాదమేమి ? అట్టి వరులు వేనకువేలు.”

“ తెలివితక్కువ, అర్థములేని మాటలవలన ప్రయోజనములేదు.”

“ అయిన నిపు డేమందువు ? ”

“ అన్నియు వ్రాతపూర్వకముగ నిర్ధారణచేయుడు. పిల్లవానిని మనకర్చులపై ఇంగ్లండు ఐ. సి. ఎస్. కు పంపుడు. వివాహమహోత్సవము మూడువత్సరములైన పిదపనే చేయవచ్చును ”

సర్వసమ్మతమైన దీమార్గము శాస్త్రి యీ విషయమునకు హృదయపూర్వకసంతోషము కనబఱచెను కాని బాలునకుమాత్రము బాలికయొక్క ముఖము నచ్చలేదు. కాని తనతండ్రి అంతము యేర్పఱచియున్నందున అతడు మౌనమువహించినాడు విశేషించి యింగ్లండునకు పోవుట యాతని కెంతయో ముదమునిచ్చినది.

## 3

రామచంద్రు డింగ్లండునకువెళ్ళి రెండువత్సరములైనది శాస్త్రి రంగూనులో నుండెను ఒంటరిజీవితము దుస్సహముగ నున్నదాతనికి. తనకు భార్యయైన వెనుకటిస్త్రీపై కాతనిహృదయము ప్రసరించినది ఆమెయిష్టప్రకారమే యామె తనతోనుండిన బాగుండెడిది అయినను రంగూనువంటి ప్రదేశములందిట్టి యపవాదులవలన వచ్చెడి నష్టమేమి ? ఇచటి జీవి

తము తీర్థయాత్రలవంటిది. ఒకవేళ యాపె తిరిగివచ్చుచో తామ చేకొనుసా? అసంబద్ధము అని యాతడు తలచెను. తిరిగి వెంటనే ఏల పరిగ్రహింపరాదు? అహల్య, తార మొదలగువారు లేరా?

ఇట్టి యాలోచనలతో చెడిపోవలసినంత చెడినదాతనిమనస్సు అతనికి జబ్బుచేసినదని యాతడు తలచెను. వైద్యులసలహా గైకొనెను అతనిని స్వదేశమునకేగుమనియు స్వజనముతో నుండుమనియు వైద్యులనిరి శాస్త్రికదియుక్తమని తోచినది. ఒక వారము దినములలో మద్రాసుకు పయనమైనాడు ఓడలో అతడు డెక్కుపాసింజరు. అట్లు ప్రయాణము చేయుటయే యాతని యలవాటు. మామూలు తరగతిలో సుఖమున్నపుడనవసరముగ డబ్బునేల వ్యయ మొనర్పవలెనని ఆతనిఉూహ.

రెండవతరగతిలోనా ఓడలోనే పయనించు నొక యువతి తనభార్యవలె ఆతనికి గనిపించినది. పోల్చికొనుట కెన్నియో పర్యాయములామె నాతడు చూచెను. ప్రయాణము చివరినాడు తనభార్యయేయను నిశ్చయ మాతని కేర్పడినది. ఓడదిగునపుడు పోర్టరులామెసామానంతయు క్రిందికి దింపిరి

ఆమె దిగునపుడు శాస్త్రి ఆమె కెదురుగ నిలువబడెను. ఒకరి నొకరు జంకక తేఱిచూచికొనిరి. “నీవు నాతో మాట్లాడ దలచినచో ౧౧౮ అంగప్పనాయకవీథికిరమ్ము” అని యాపె చెప్పినది. “మంచిది. నీవు ఆపెవే యగుదువు” అని శాస్త్రియనెను “అవు నవును.” అనియామె నవ్వినది

## ౪

శాస్త్రి నేరుగ సీతారామయ్యగారింటికేగెను. చుట్టటిక మింకను కాగితములందే యున్నను అయ్యరుగారిభార్య యాతని నెంతయో గౌరవించినది.

ఆ దినములు హరిజనుల దేవాలయప్రవేశ వాతావరణముచే నిబిడితములు. “సనాతనధర్మ మంతరించినది” అని ముక్తకంఠమున నెల్లరు వచించుచుండిరి. శాస్త్రికి నటులే తోచినది.

“మీరందఱును శారదా చట్టము నేల ప్రవేశపెట్టనిచ్చితిరి? దాని ఫలమిదియే” అని సీతారామయ్యరుగారిభార్య ఎలుగెత్తి నిశ్చయపూర్వకముగ పలికినది.

“అది కేవలము తెలివితక్కువమాట. శారదాచట్టప్రవేశమునకును దీనికిని సంబంధమేమి?” అని అయ్యారనెను.

## ఆంధ్రుఁడా!

ఉత్కళులు పెల్లురేఁగి సంపత్కరంబు
నాంధ్రభూమిని నాఁచికొ నడరుచుండ
దిక్కుమొక్కును లేనట్లు దెసలుచూచి
తెల్లఁబోయెద వేమోయి? తెనుఁగుబిడ్డ!
ఆంధ్రరాష్ట్రంబుకై భూమి, యాకసంబు
బ్రద్దలగునట్లు గంధగోళంబుసలిపి
ఆప్రశంసయె విస్మృతినంది మనుట
ఆంధ్రప్రతిభకు తగునయ్య! ఆంధ్రతనయ!
ఆంధ్రపుత్రుల యలసత కనుతపించు
ఆంధ్రభూమాస్వరూపంబు నవధరించి
ఆంధ్రజనని ప్రబోధించు టరసియైన
దీక్ష గైకొనఁగదవోయి తెనుఁగుబిడ్డ!
అర్థమున, విద్యయందు దసమర్థులాంధ్రు
లిట్టిరాపంబు గడియించి మిట్టిపడఁగ
అర్థవిద్యాసమృద్ధులు నతిసమర్థు
లాంధ్రు లిట్లుంట పౌరుషహానికాదె?
బ్రహ్మపురితోడిపాటాంధ్రరాజ్యవిభజ
నంబు మాన్పించుదాఁక మానని ప్రతిజ్ఞఁ
బూని శాంతోద్యమమునూని పూర్ణవిజయ
సిద్ధితో నాంధ్రుఁడా! సుప్రసిద్ధిగనుము!

ముళ్ళపూడి వేంకటశాస్త్రి

"అంతయునొకటే. ఆచారాతిక్రమమునకు మీరు ప్రోత్సాహించుచున్నారు ప్రజలను."

"ఆమె చెప్పుదానిలో అర్థము విశేషముగ నున్నది" అని శాస్త్రి అందుకొనెను.

"మీరు రంగూనుప్రయాణములో ప్రారంభించినారు" అని అయ్యరుగారిఆఫీసులో యొక అల్పవయస్కుడగు న్యాయవాది ఎత్తిపొడిచెను.

"నిరర్థకపుప్రశ్నలుడువల్ల నేమి? బ్రతుకుకొరకు రంగూను వెళ్లుటకును, ఇంగ్లండున కేగుటకును హరిజన దేవాలయప్రవేశమునకును సంబంధములేదు" అని శాస్త్రి ఎలుగెత్తి చెప్పెను.

"అసలు నాల్గువర్ణములే శాస్త్రముందున్నవి. అయిదవవర్ణము సృష్టించుటకు మీకధికారములేదు. హరిజనులకు సైతము వారివృత్తి ననుసరించి వర్ణమేల నిర్ణయింపరాదు," అని జూనియర్ వకీలడిగెను.

"అల్పజ్ఞానమంతటి హానికరమగునది వేరొకటి లేదు. మీరేదియో యొకటిరెండు ఆంగ్లేయభాషాంతరీకరణములచదివి గీర్వాణభాషామహోదధి నాలోడించినట్లు మాట్లాడుచున్నారు. చాతుర్వర్ణ్యమే ఆద్యసృష్టి. తరువాత వర్ణసాంకర్యమున మరియొకవంశముదయించినది. ప్రతిలోమవివాహములు వర్ణసాంకర్యముచేసి జాతిచండాలురకునికికి కారణభూతములైనవి"

"భగవత్ప్రోక్తములగు సిద్ధాంతము లసత్యములని శాస్త్రిగారియుద్దేశ్యము మాలలు, మాదిగలు మొదలగు నీచజాతులకు తల్లులు ఉన్నతబ్రాహ్మణవంశములోని స్త్రీలని మీవాదమున తేలుచున్నది. మన మాతామహ పితామహుల సంతానము అంతదుష్టమగునా?" అని జూనియర్ లాయర్ ప్రశ్నించెను

"ఏతాదృశవిషయచర్చ కిది తావుగాదు." ఆగ్రహపూరితస్వరమున శాస్త్రి వచించెను. "ప్రతిలోమవివాహములసంతతియని సార్వజనీనముగ నంగీకృతపూర్వములగు విషయములను నిర్ధారింపుడని మీరడుగగూడదు మన బ్రాహ్మణత్వమును ఇట్లుగాక వేఱువిధమున మనము సిద్ధాంతీకరించుకొనగలమా?"

"ఉన్న విశేషమేమన వారు చట్టముల నేర్పఱుప నెంతురు? ఒకరి నుద్ధరించుటకును, ప్రోత్సహించుటకును మాకెట్టి యభ్యంతరమును లేదు." అని జూనియరులాయరు సీతారామయ్యరుగారి చుఱుకుచూపుల కించుక భయపడుచు పలికెను.

"అవును. దాని కెవరడ్డుపడెదరు? వారికి సాయము చేయవచ్చును. చందాలు ప్రోగుచేయవచ్చును కాని మతవిషయికమగు అనవసరప్రవేశమునకే మే మడ్డుపెట్టుచున్నాము" అని శాస్త్రి నుడివెను.

"మతమననేమి?" అని చర్చాజిగీషతో జూనియరు లాయరు అడిగెను

"చాలుచాలును, పదిగంట లగుచున్నది. మనము కోర్టుకు పోవలెను వేదాంతచర్చ అవల జరుపవచ్చును." అని అయ్యరుగారు వాదము నాపిరి

వారందరు కోర్టునకేగిరి. శాస్త్రి ౧౧౮ అంగప్పనాయకవీథి కేగెను

జగదీశశాస్త్రి కాశీ కొకటికెక్కెట్టు కొనునపుడు "తాతా! ఏమార్గమున కేగెదవు" అని బుకింగు క్లార్కు ప్రశ్నించెను ఎవరు నింతవరకు ఆసన్నమరణ సంసూచికమగు నట్టిసంబోధనములో నాతనిని సంబోధించియుండలేదు. "మామా!" అని యే యీవరకు తనిని పిలచెడివారు. "ఏది దగ్గరగనుండునో యామార్గమున కిమ్ము, నేను తొందరగ వారణాసికేగి నా పాపములను పరిహరింపచేసికొనవలయును" అని శాస్త్రి బదులిడెను.

అంగప్పనాయకవీథియందు దాపెను శాస్త్రి కలుసుకొనెను. ఆమె అతని భార్యయే కాని యెంతవిషయము బహిర్గతమైనది! కల్పనాకథకంటె సత్యవృత్తాంతము విచిత్రతరమైనది.

నగలవర్తకుడనియు, కంపెనీఏజంటనియు చెప్పిన— శాస్త్రి మామగారనుకొను నాగేశ్వరఅయ్యరు అయ్యరుగాడు, నగలవర్తకుడునుగాడు. తిరువళ్లూరులోని యొక మంగలి త్యాగరాజయ్యరు అను నొకవ్యక్తి వెంటు జనములతో కలకత్తాకేగి యొకమంగలిషాపు స్థాపించి

విశేషధనము గడించెను, నీతిదూరయగు నొక బ్రాహ్మణ విధవ నుంచికొనెను. ఆమె కాతనివలన ముగ్గురు బాలికలు కలిగిరి. జగదీశశాస్త్రిభార్య యొక కొమారుడు. వాడిపుడు పేరుమార్చికొనినందులకును, చేసినమోసమునకును నేరము మోపబడి లాహోరుచెఱసాలయందు బంధింపబడి యున్నాడు. శాస్త్రి భార్య నాటకకంపెనీవారితో తిరిగితిరిగి తుదకు ఫిలింకంపెనీలలోచేరి యిపుడు మద్రాసునందు సావిత్రిపాత్రధరింపనున్నది. ఆమె కిపుడు సుఖమునకుగాని, ధనమునకుగాని యెట్టి కొరతయులేదు. ఆమె బెదరించినచో శాస్త్రి విశేషధననష్టమునకే పాలు గావలసియుండెడివాడు గాని దైవకృపవల్ల అట్టియూహ ఆమెహృదయమున నుదయించినదిగాదు.

“నేను మిమ్ము మోసముచేసితిని అగతికుడగు నాతండ్రిని భగవంతుడు క్షమించుగాక! మీరు వారణాసి కేగుడు. గంగాభవాని మీజీర్ణశరీరమునందలి కల్మషములను గడగివేయుగాక!” అని శాస్త్రిభార్య పలికినది. వృద్ధుడగు శాస్త్రి పిల్లవానివలె వాపోయెను ఆమె తనచీరచెఱగున నాతని యశ్రువులను తుడిచినది

“ఈ కులముల నెవరు సృష్టించిరి? బ్రహ్మసృష్టి కాదు కేవలము మనుష్యనిర్మితములు.” అని పునర్లబ్ధయగు భార్యను దగ్గఱకు తీసికొనుచు శాస్త్రియనెను.

“అట్లుపలుకు, వలదు” అని యామె నగుచు అనినది. “మీచే స్పృశింపబడుటకును తగినదాననుగాను నాతలపైనున్న పాపములు నాసంతతిలో పదితరముల వారిని అధోగతిపాలు చేయగలవు.”

వృద్ధుడు నిర్విణ్ణుడాయెను. నాటకసమాజములు! ఫిలింకంపెనీలు!—ఆతడు వానినిగుఱించి వినెను. ఆమె వచించిన దతిశయోక్తి కాజాలదు. కేంబ్రిడ్జిలోని కుమారుని తలంచుకొనెను రెండు నెలలలో స్వదేశమునకు రాగలడు వివాహమును జరుగును. నాపిల్లవాడు ఇట్లు లేచిపోయినస్త్రీకి జనించినవాడని వినుచో సీతారామయ్యరు సంబంధమున కంగీకరించునా? పిల్లవాని వంశమేది? ఇట్టి యాలోచనలలో ఆతని తల తిరిగిపోయినది.

౬

జగదీశశాస్త్రి కాశికి ప్రయాణముచేయుచుండెను. పొగబండిలో నాతడు రెండవరాత్రిని గడపుచుండెను. నిద్ర తూగుచుండెను. తోటి ప్రయాణీకు లాతనిపైదయ తలచి నిద్రించుట కాతని కించుక తావిచ్చిరి ఆతడు నిద్రలో భయంకరముగు కలగనుచుండెను

* * *

రామచంద్రుడు ఇంగ్లండునుండి తిరిగి వచ్చినాడు. కాని యాతడొక సత్కులీను డగుటకు మారు ఒక పంచమబాలు డాయెను! వింతమార్పు. కాని జగదీశశాస్త్రికి తనయునియందున్న పూర్వప్రేమ నశింపలేదు. కుమారునకు వివాహముచేయుటకై కన్యను, ఆతని కుద్యోగమును నన్వేషించుచుండెను.

సీతారామయ్యరు, ఆతని భార్యయు వారి నింటినుండి తరిమివేసిరి. అచటి తోటమాలియు, పాకీవాడును, మోటారునడుపువాడును కేకలువేయుచు వృద్ధుడగు శాస్త్రిని, ఆతనికుమారుని దూరముగ తఱిమిరి. ఒకపెద్ద జనసమూహము ప్రోగైనది. శాస్త్రి పరుగెత్తుచున్న యొక బండిలోనికురికి తప్పించుకొని పోయెను . .

తరువాత దృశ్యము మారినది

శాస్త్రి స్వగ్రామమున నుండెను. బంధువులందఱాతని కుమారుని పంచమునిగ చూచుచుండిరి. మరల నాతడు మద్రాసుకేగెను. ఒక మోటారుబస్సులో వెళ్లుచుండెను. అపిల్లవాడెవరని కండక్టరు అడిగెను. మెడలో రుద్రాక్షమాలగల యొకముసలిబ్రాహ్మణుడు “చండాలుడు, చండాలుడు” అని కేకలువేసెను. అంతట బస్సులోనివారందరును “గెంటివేయుడు, గెంటివేయుడు” అని గొందరించిరి. అం దొకమహమ్మదీయుని ముఖమునుండి కూడ శాస్త్రిపై నిరసనవచనములే వినరాయెను అంతట ఆబాలుని క్రిందికి గెంటిరి వృద్ధుడగు శాస్త్రియు క్రిందికి దూకెను. సిగ్గున తలదాచికొనుటకు వారిరువు రొకసందులోనికేగిరి,

దృశ్యము మారినది—

మైలాపూరు. లజ్ రోడ్డు. సీతారామయ్యరు ఆఫీసు. "మీరు నాకుమారు నొకగుమాస్తాగా నియమింప జాలరా?" అని శాస్త్రి అయ్యరును ప్రార్థించెను.

"అదెట్లు వీలుపడును? నాభార్య యంగీకరింపదు." అని అయ్యరు వినీవిననట్లు చెప్పివైచెను.

ఆకస్మికముగ అయ్యరుభార్య ప్రత్యక్షమైన దా దృశ్యమున. శాస్త్రి భయమున వణకిపోయెను

"ఏమీ? పంచముడు, మాయాఫీసులో పనిచేయుచు మా వస్తువులను ముట్టుకొనన నిమ్మందువా?" అని యాగ్రహాపూరితయై చీదరించుచు పలికినది

"అట్లన లేదు అయ్యరుగారితో కోర్టుకడనుండి పని చేసి వెళ్ళివచ్చుచుండును. తమయింటి కీతడు రాడు"

"మాకట్టి నౌకరు అక్కఱలేదు. మాడబ్బు మాకిచ్చి యావల కదలుము." అని యామె వచించినది.

౧౫౦౦౦ వేల రూప్యములు అయ్యరు రామచంద్రుడు కేంబ్రిడ్జిలో చదువుటకు వ్యయమొనర్చెను. తన కూతు నిచ్చుచో సాధనము చెల్లింపనక్కఱలేదు. కాని యిపుడది దురవకాశము నాటి ఎగ్రిమెంటు పత్రములోని ప్రత్యక్షరము కలలో జగదీశశాస్త్రి నేడు చదువ గలుగుచుండెను ఆస్వప్న మంతస్పష్టముగనున్నది.

తిరిగి మఱియొక దృశ్యము—

దండమును చేతబట్టుకొని కృష్ణాజినముపై కూరుచున్న యొకసన్యాసితో శాస్త్రి వాదించుచుండెను "స్వామీ! నాకుమారుని అనుగ్రహించి బ్రాహ్మణునిగ చేయుడు."

"దుర్లభము," అని కాషాయవస్త్రధారియగు నా సన్యాసి అజ్ఞాపూరితమగు కీచుగొంతుకతో ప్రత్యుత్తరించెను. "చండాలుడు తనశరీరమును కాల్చి బూడిద చేసి మఱియొక జన్మకవకాశము కలుగచేసిననే గాని యాతని చండాలత్వమును మాన్చుకోజాలడు. కాని సత్కర్మలచే నాతడు మంచివాడనిపించుకో దలచినచో కులధర్మముల విడువక ప్రవర్తించుచు ఎప్పుడేని యున్నతకులీనుడు కాగలడు అయిన బ్రాహ్మణుడగుట కెన్నియో జన్మలు పట్టును"

"నీవు కృతఘ్నుడవు. మోసప్రవర్తన గలవాడవు. ఎన్నియో యపరాధములను చేసితివి." అని శాస్త్రి సన్యాసిని దూషించెను.

"నాపూర్వాశ్రమములోని విషయములను దడివి నందుల కిదే శపించుచున్నాను." అని యా సన్యాసి దండము నెత్తి కొట్టెను.

* * *

బల్లమీదనుండి నిద్రించుచున్నశాస్త్రి క్రిందకుపడెను. ఆపెట్టెలోని నాగంపబును నవ్వుచుండిరి. శాస్త్రి మేల్కాంచెను.

౭

మూడవరాత్రికూడ ఇట్టిస్వప్నములే యాతనికి వచ్చినవి. సాధారణముగ కొన్నిస్వప్నములు స్వప్నమందే యర్థమగుచుండును. కొన్నిస్వప్నములు మహాభయంకరములు శాస్త్రి స్వప్నము తీవ్రగతియందే చేరును. ఇంకను అతడు తన చండాలపుత్రునితో తిరుగుచునే యుండెను.

వృక్షములు "చండాలుడు" అని రహస్యముగ పలికినవి "చండాల" అని పక్షులుపాడినవి. ధూమశకటచక్రములు "చండాల చండాల" యనిధ్వనించుచున్నవి.

రావుబహదూర్ నరసింహాచార్యులు ఢిల్లీకి పోవుచుండెను. "అయ్యా! నాకుమారుని తమతో గొంపోయి నౌకరుగ నియమించుకొనుడు, చదివినవాడు పట్టపరీక్ష నిచ్చినాడు, దౌర్భాగ్యవశమున పంచముడుగ మాఱిపోయినాడు." అనిశాస్త్రి ప్రార్థించెను.

ఢిల్లీలో కులభేద మంతగ పాటింప రనుమాట సత్యము కాని మాయింటిలో పంచము నెట్లుంచుకొనగలను? పోనీ యొకశూద్రు నేని తీసికొనిరమ్ము." అనియాచార్యులు పలికెను

"వీనినే శూద్రునిగ మార్తునా?" అనిశాస్త్రి. "కానిమ్ము" అని యాచార్యులు. "మార్చుము, మార్చుము" అనిస్వప్నమందే శాస్త్రి పలవరించెను. కాని అది యాకారరహితమగు కష్టకార్యము

“నేను శూద్రుడనుగ నెట్లుమారగలను?” అనిబాలుడు అడ్డుప్రశ్నవైచెను. “నేను చండాలుడను బ్రహ్మ రక్తము, మంగలిరక్తము ఏకమై నారక్తనాళములందు ప్రవహించుచున్నది. వర్ణసంకరమున చండాలజాతి అని నీవే వచించితివి గదా”

“నిజము. నిజము. దయామయుడా! ఈ శాస్త్రములనేల యూడిదచేయుదువు?”

“నాన్నా! నేను రైల్వేపోర్టరుగ నుందును అట ఎవరును నన్నడ్డుపెట్టజాలరు.”

“ప్రయత్నింపుము అట్లేయుండుటకు యత్నింపుము.”

రైల్వేపోర్టరు పదవిదొరికినది. మంచిదుస్తుల ధరించికొనిన యొక పెద్దమనిషి యాపిల్లవానికి చిన్నపెట్టెమోసికొనివచ్చి నందులకు నాలుగణాలనిచ్చెను. తరువాతిసామానొక బ్రాహ్మణోద్యోగిది. ఆతనిభార్యయు వెంటవేయున్నది. ఒకపెద్ద పరుపుచుట్ట, ఒకబరువైనపెట్టె, ఒకగుడ్డల మూటయు గలవు. ఈ పోర్టరు అన్నిటిని పైకెత్తికొనెను. బయలుదేరు సమయమున నొక కొంటెపిల్లవాడువచ్చి చేతులు చఱచుచు, “అయ్యరుగారూ! అయ్యరుగారూ! ఆతడు పంచముడు” అనిఅరచెను.

“ఏమీ, నీవు పంచముడవా?”అని యుద్యోగియు, అతనిభార్యయు మండిపడిరి. “అవును స్వామీ” అని యాబాలుడు వణకెను.

“నాసామాను ముట్టకొనసాహసించితివా? గాడిదా!” అనియాతడనగా వాడాసామాను పడవైచిపాఱిపోయెను.

* * *

వృద్ధుడు, కుమారుడు విసుగెత్తి తిరిగిరి. వృద్ధుని కాళ్లు బలహీనములు కట్టినవి నాలుక పిడుచవాఱినది, కాని జల మెటదొరకును?

“నాకు మిక్కుల దప్పిక వైచుచున్నది. కొంచెము నీరుతెమ్ము” అనితండ్రి రామచంద్రు నడిగెను.

“ఎవరినేని యడిగితెత్తునా? కాని నాకెవరు నీయరు. నేనుచండాలుడను.”

“అయ్యో! నాయనా! నిజము, నిజము, నీకెవరు నీరు నీయరు, ఆహార మింతయిడరు. దాన, ఆపదార్థమంతయు నపరిశుభ్రమగును”

“తండ్రీ! మనము కేంబ్రిడ్జికేగుదము. రమ్ము, అటజనులను ఈ విధముగ చావనీయరు” అని కుమారుడు పలికెను.

“అది చాలదూరమున నున్నది. ఎట్లు పోగల మీ తిరువళ్లూరునుండి యిప్పుడు?”

## హృదయావేగము

వండ్లఁ బూవులఁ గాయలఁ బల్లెరమునఁ
బట్టి నిల్చితి మంగణభాగమందు
దర్శనముఁ గోరి; వేగమ తలుపుతీసి,
యాత్మజుల మమ్ము దీవింపు మాంధ్రమాత!
కొడుకులను గన్నదానవు; కోట్లకొలఁదిఁ
గాఁగఁ గడఁగొట్టువారము కలము మేము,
మమ్ము - నీయగ్రసుతుల - నేమమ్మునంగ
వరసి సమరీతి లాలింపు మాంధ్రజనని!
అంబ! అలవని యనక రేయింబవళ్లు
చెమ్మటలనూడ్చి, కష్టమ్ము చేసిచేసి,
కడుపునిండుగ నొకపూఁట కుడుపు లేక
యడలు, మముఁదరిఁ జేర్పుమో యాంధ్ర దేవి!
ప్రజల రంజించుటొండెయాఁ బాడి నీకు;
లేదు రంజనయొక్కింతగాదె మాకు?
నదిగో! దారిద్ర్యదుఃఖదవాగ్ని మమ్ము
నంటె; నద్దానిఁదొలఁచుమో యాంధ్రరాజ్ఞి!
కనుము, మాయగ్రజులు చిరకాలమందె
మమ్ము వెలివేసి, మద్యమాంసమ్ములనెడు
భూతముల కెరఁగావించి నీతిఁదొఱగి
యడలఁజేసిరి; శరణ మోయాంధ్రభూమి!

[illegible]

"ఆ అదిగో అటు నొకదిగుడుబావి గలదు. అట కేగి దాహముతీర్చుకొందము."

వారిరువురు భయపడుచునే యాబావికడ కేగిరి ఎవరును లేరు. తనివితీర దాహము పుచ్చుకొనిరి, తిరిగివచ్చునంతలో నొకముసలిబ్రాహ్మణస్త్రీ ఎదురుపడినది. "ఎవడీమాలవాడు. నీరంతయు అపవిత్రముచేసినాడు. నేను నీ రెట్లు తీసికొనిపోవుదు నిపుడు" అని బిగ్గరగ కేకలిడినది. ఇంతలో పెద్దగుంపు బాలుని కొట్టుటకు కూడినది

"నాపిల్లవా డితడు ఈతనినికొట్టకుడు. పంచముడు కా డీతడు" అనిశాస్త్రి సమర్థించుకొనుచుండెను. "ప్రమాణము చూపుము" అనియాగుంపు గద్దించినది ఇంతలో శాస్త్రిభార్య ఎట్లో యాగుంపులోనికి చొఱబడి "ఈతడు నాకు జనించినాడు, నేను చండాలస్త్రీని, ఇతడును చండాలుడు, భగవంతు డితనిని క్షమించుగాక" అనిపలికినది. "కొట్టుడు, చంపివేయుడు" అని యాజనులఱచుచుండగనే శాస్త్రియు, కుమారుడును ప్రాణరక్షణకై పాఱిపోయిరి.

* * *

వారిరువురు నొక పెద్దదేవాలయముకడ కేగిరి. మనోహరమగు దానిగాలిగోపురము ఆకాశమునంటి యైహికములగు సుఖదుఃఖముల నలక్ష్యదృష్టులతో చూచుచుండియు కరుణారసపూరితమైయున్నట్లుండెను.

"జగత్పితా! నీవులోకరక్షకుడవు, ఆర్తత్రాణపరాయణుడవు. నాకును, నాకుమారునకును ఒకయపవాదు వచ్చినది చండాలుని నీదర్శనము చేయనిత్తువా?" అని శాస్త్రి ఉచ్చస్వరమునపలికెను.

"నేను లోకమునకు తల్లిని, తండ్రిని నాకడకు రాకూడనంతనీచు డుండడు. అందఱును నాకడకు నిరభ్యంతరముగా రావచ్చును" అనియొకవాక్య మాతనిహృదయమునకు వినిపించినది. శాస్త్రి దీర్ఘముగ నిశ్వసించినాడు. తనకుమారుని చేయిపట్టుకొని అవిశాలమగు దేవాలయద్వారముగుండా జనసమ్మర్దమును తోసికొని లోనప్రవేశించెను. తండ్రి కుమారు లిరువురును దేదీప్యమానమగు భగవన్మూర్తి యెదుట సాష్టాంగపడి ధ్యానమగ్నులైరి. అననుభూతపూర్వమగు ఆనందముతో లేచి నిలుచబడిరి అకస్మికముగ మసిబొగ్గువలె నల్లటిశరీరముగల యొక పూజారి యెటనుండియో తోసికొనివచ్చి బొబ్బలుపెట్టెను ఆ ప్రదేశమంతయు నిమిషములో జనులచే క్రిక్కిఱిసిపోయెను "చండాలుడు చంపుడు అపవిత్రము," అను కేకలు విన్పించుచుండెను.

"ఈ దేవమూర్తియే మమ్ముపిలిచెను" అని శాస్త్రి అభ్యంతరపెట్టెను.

"ముసలివానిని విడువుడు, అతడు మంచివాడు, బాలుడే యపవిత్రుడు, చండాలుడు" అని పూజారి యఱచెను

"నాకుమారుని చంపకుడు. నన్నుచంపుడు. అయ్యో!" అని దురదృష్టవంతుడగు నాముసలిశాస్త్రి యేడ్చుచుండెను ——

శాస్త్రి కండ్లునలుపుకొనుచు తన పల్లమీద లేచి కూరుచుండెను. టిక్కెట్టుకలెక్టరాతని వీపుతట్టిలేపెను తాను అనుభవించినదంతయు స్వప్నగతమనియు తనకుమారు డింగ్లండులో సుఖముగ నున్నవిషయము స్మరించుకొనిన పిదప నాతడు పొందిన సంతసమునకు మేరలేదు

## ఉపసంహారము

రామచంద్రుడు కర్నూలులో అసిస్టెంటుకలెక్టరుగ నియమితుడాయెడు. లేచిపోయిన జగదీశశాస్త్రిభార్యావిషయము సీతారామయ్య రిసుమంతేని యెఱుగడు నిశ్చితపూర్వమగు పద్ధతిపై రామచంద్రుని వివాహము వైభవముగ జరిగెను. కాని వృద్ధుడగు శాస్త్రి యెటకేగినదియు తెలియమి ఎల్లరు విస్మితులైరి. వేదాంతవిషయికోత్సాహపారవశ్యమున కాశీయాత్ర కేగియుండునని జనులు వచింపసాగిరి అటనే సన్యాసియాయెనని వారనిరి కాని కొంద ఱేదియో విషజ్వరమున అత డచట మరణించియుండునని తలచిరి

[శ్రీమాన్ సి. రాజగోపాలాచార్యులవారు 'హరిజన' పత్రికలో వ్రాసిన కథకు అనువాదము.]